## విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, మార్చి 7 : విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని అనసూయ పవార్ నగర్‌లో 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా రూ.61 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 12 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో 250 మంది విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు పల్సికర్ శ్రీనివాస్‌ను పూలమాలతో సన్మానించారు. ఎంపీపీ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్ చందులాల్, ఎంఈవో సుభాష్, నాయకులు పాల్గొన్నారు.

## భగవంతుడి నామస్మరణ ముఖ్యం

- బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



దత్తాత్రి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా టౌన్, మార్చి 7 : మానవులు సమస్యల నుంచి బయట పడేందుకు భగవంతుడి నామస్మరణ అతిముఖ్యమని బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఉద్ఘాటించారు. దేగాం గ్రామంలో గురువారం దత్తాత్రేయ ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.





ధర్నాలో బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న

# ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ కదం

- ప్రజాప్రతినిధులు, నాయకులు ప్లకార్డులతోప్రదర్శన
- ఉచితంగా చేయాల్సిందేనని రామన్న డిమాండ్
- కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేత

### ధర్నాతో దద్దరిల్లిన ఆదిలాబాద్ కలెక్టరేట్

ఎదులాపురం, మార్చి 7 : ''ఎలాంటి ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలి.. నిన్న ఫ్రీ ఫ్రీ అన్నది.. కాంగ్రెస్ అధికారమిస్తే ఫీజు ఫీజు అంటున్నది.. 25 లక్షల మంది సమస్య ఎల్ఆర్ఎస్.. రూ.20 వేల కోట్ల ప్రజాధనం దోపిడీ.. ప్రజల జేబులు కొట్టేందుకే ఫీజు..'' అని ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎల్ఆర్ఎస్‌పై కదం తొక్కారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహించారు. దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం.. కాంగ్రెస్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ఎలాంటి ఫీజు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామన్న కాంగ్రెస్.. ఇప్పుడేమో ఫీజు రద్దు చేయకుండా ప్రజలపై ఆర్థికభారం మోపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతికి చెందిన 25 లక్షల కుటుంబాలపై పెనుభారం మోపి.. రూ.20 వేల కోట్ల వసూళ్లకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ పథకాన్ని తప్పు పట్టి ప్రజల్లో విషాన్ని నింపిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడేమో అదే ఎల్ఆర్ఎస్‌ను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, రైతు సమన్వయ అధ్యక్షుడు రమేశ్, వార్డు కౌన్సిలర్లు పవన్ నాయక్, భారత్‌కుమార్, ప్రకాశ్, అవుల వెంకన్న, భూమన్న, రామ్‌కుమార్, కొండ గణేశ్, లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి రమేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూపారాణి, పర్వీన్ పేరోజ్, సీనియర్ నాయకులు యాసం నర్సింగ్, సలీం పాషా, సాజిదుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు శౌకత్‌అలీ, రాజు, ఆశన్న, శివకుమార్, సాయి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అల్లోల పరామర్శ



డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగాపూర్, మార్చి 7 ః కౌట్ల(బి)కి చెందిన డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి ఇటీవల నిర్మల్ జిల్లాలోని మహబూబ్‌ఘాట్ వద్ద కారు బోల్తా పడడంతో గాయాలయ్యాయి. అలాగే జెవుళి మాజీ సర్పంచ్ మధూకర్‌రెడ్డి తల్లిదండ్రులు లస్మవ్వ, ముత్యంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ నల్లా వెంకట్‌రాం రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొత్తపెల్లి మాధవరావు, ఎంపీటీసీ భోజారెడ్డి, నాయకులు రాజ్‌మహ్మద్, గంగారెడ్డి, ధర్మాజీగారి రాజేందర్ ఉన్నారు.

**పాకాలకు..**

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 7 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పాకాల రాంచందర్ మామ విశ్రాంత ఉద్యోగి హనుమాండ్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉంటున్న రాంచందర్ కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మంత్రి వెంట జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ రాజేందర్, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి ఉన్నారు.

## స్త్రీలను గౌరవించే సంప్రదాయం మనది



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, మార్చి 7 : స్త్రీలను గౌరవించే సంప్రదాయం మనదని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్పీ మహిళా పోలీసులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపి.. సెలువు ప్రకటించారు. పోలీసు విభాగంలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ మహిళలకు బహుమతులను అందించారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనుస్ అలీ, ఆర్ఐ శైలేందర్, సీఐ అనిల్ పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

## ప్రభుత్వాల దొంగాట

- నిధులు ఇచ్చామంటున్న కేంద్రం.. ఇవ్వలేదంటున్న రాష్ట్ర సర్కారు
- ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు
- డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా

ఎదులాపురం, మార్చి 7 : 'కేంద్రంలోని బీజేపీ సర్కారు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మా జీవితాలతో దొంగాట ఆడుతున్నాయని నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) స్కీం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. ఆ సంఘం కార్యదర్శి నరేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం ఉందని పేర్కొన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ, ఇంటి అద్దె, పాఠశాల పిల్లలకు ఫీజులకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గత నెల 16న కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి రాష్ట్ర నాయకులకు మెమొరాండం ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ వేతనాలు ఇవ్వకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. ఉద్యోగులు ప్రవీణ్, రమణ, శివ, ప్రశాంత్ దేశ్‌పాండే, నవీన్‌కుమార్, విష్ణు, రనిత, అనూష, హారిక, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

## 104 ఉద్యోగుల ధర్నా

ఎదులాపురం, మార్చి 7 : 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆ యూనియన్ నాయకులు పెండింగ్ సమస్యలపై ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16 ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు, అన్ని అర్హతలు ఉన్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి నేరుగా ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉద్యోగులు ఆనంద్, సురేందర్, నగానథ్, సుభాష్, ఇబ్రహీం, వెంకన్న, ప్రశాంత్, సంధ్య, పద్మ, శ్రీకాంత్, అశోక్‌రెడ్డి, పురుషోత్తం, వామన్‌రావులు పాల్గొన్నారు.

## మహిళలు సమర్థవంతంగా రాణిస్తున్నారు

- తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఎదులాపురం, మార్చి 7 : ఇంటి పనులతోపాటు కార్యాలయ పనులను కూడా మహిళలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. గురువారం ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషన్ సభ్యురాలు, కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి మాట్లాడుతూ.. నేటి ప్రపంచంలో మహిళాలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆడ, మగ పిల్లలను సమానంగా పెంచాలన్నారు. అనంతరం వివిధ రంగాలలో రాణించిన వారికి బహుమతులను అందజేశారు. అంతకుముందు పిల్లలతో కలిసి కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండే, జిల్లా సంక్షేమ అధికారులు సబిత, భగత్ సునీత, మిల్కా, ప్రణిత, ఆర్టీసీ డీఎం కల్పన, డీఎస్పీ జీవన్ రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి చిన్నారికి తినిపిస్తున్న రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు, కలెక్టర్, మహిళ అధికారులు

## ఆదిలాబాద్ ఆర్టీసీ సిబ్బందికి అవార్డులు



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో అవార్డులు అందుకున్న కండక్టర్ హైదర్, డ్రైవర్ బాబు, టీబీ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 7 : మేడారం జాతరలో ఆదిలాబాద్ రీజినల్‌కు అధిక ఆదాయం తెచ్చిన ఆదిలాబాద్ డిపో కండక్టర్ హైదర్, డ్రైవర్ బాబు, టీబీ రెడ్డిలకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, క్యాష్ అవార్డు అందుకున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కరీంనగర్ జోన్ ఈడీ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## బాసర ఆలయంలో కాగ్ ఆడిట్

బాసర, మార్చి 7 : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో కాగ్ ఆడిట్ కొనసాగుతున్నది. బుధవారం ప్రారంభమైన ఆడిట్ మరో నాలుగు రోజులపాటు కొనసాగనున్నది. ఎనిమిదేండ్లుగా ఆలయ ఆదాయం, వ్యయాలకు సంబంధించి ఆడిట్‌లో నివేదికలను తయారు చేయనున్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, ఆభరణాలు, ఆలయ భూములతోటు ఖర్చులను పరిశీలించనున్నారు.




భైంసా ః కిసాన్‌గల్లిలోని మహాదేవ్ మందిరం



దస్తురాబాద్ : విద్యుద్దీపాలతో ముస్తాబైన గొడిసెర్యాల శ్రీ రాజరాజేశ్వర ఆలయం

# శివపూజకు వేళాయే

- నేడే మహాశివరాత్రి
- ముస్తాబైన ఆలయాలు
- శివనామస్మరణతో మారుమోగనున్న దేవాలయాలు



దస్తురాబాద్ : శ్రీ రాజరాజేశ్వర ఆలయంలోని గర్భగుడి

నమస్తే నెట్‌వర్క్, మార్చి 7 : శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలు విద్యుద్దీపకాంతులతో వెలుగులీనుతున్నాయి. ఆలయాల కమిటీల సభ్యులు భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. తాగునీరు, వైద్య శిబిరాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. పోలీసులు కూడా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించనున్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని గొడిసెర్యాల శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగనున్నాయి. శుక్రవారం శివపార్వతుల కల్యాణం, జాగరణ.. 9వ తేదీన అన్నపూజ, కుంకుమ పూజ, సామూహిక హోమం.. 10వ తేదీన మల్లన్న, పోచమ్మ బోనాలు నిర్వహించనున్నారు. కడెం మండలంలోని ఎలగడప–మద్దిపడగ గ్రామాల సమీపంలోని అంగడయ్య శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. సిరికొండ మండలంలోని కొండాపూర్‌లో గల పురాతన శివాలయం.. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామం సమీపంలోని చెరువు నీటి మధ్యలో సిరిచెలమ్మ మల్లికార్జునుడు.. ఖానాపూర్ పట్టణంలోని గంగాగౌరి ఆలయం, శ్రీరామ్‌నగర్‌లోని మహాదేవ అన్నపూర్ణ ఆలయం, సాయినగర్‌లోని శ్రీ భక్త మార్కెండేయ ఈశ్వరాలయం.. భైంసా పట్టణంలోని కిసాన్ గల్లిలో గల మహాదేవ్ మందిరం, చెరువు కట్ట సమీపంలో గల శివాలయం, భట్టిగల్లిలో గల శివాలయం, సాయిబాబా గుట్టపైన గల శివాలయాలు.. ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయాల్లో వేడుకలు జరుగనున్నాయి.

## పరీక్షా కేంద్రాల తనిఖీ

- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, మార్చి 7 ః నిర్మల్ జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, వైద్య సదుపాయాలను కల్పించాలని సూచించారు.

**పరీక్షా కేంద్రాల తనిఖీ**

ఆదిలాబాద్ రూరల్, మార్చి 7 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను గురువారం కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. పరీక్షలు కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఈడీఈవో రవీందర్‌కుమార్ ఉన్నారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్